# ముసలి నవ్వు వెనక పడుచు కథ

అరగంట ఆలస్యంగా వస్తానని ముందే ఆఫీసరు దగ్గర అనుమతి తీసుకోవడం వల్ల, రోజులా కాకుండా కాస్త తాపీగా నుంచున్నాడు కిశోర్, బస్‌స్టాప్ దగ్గర. పీక్ అవర్ రష్, తగ్గిపోవడంతో, షెల్టర్‌లో తను కాక ఒకళ్లిద్దరు కంటే లేరు. చేతి కర్ర మీద గడ్డం ఆన్చుకుని కునికిపాట్లు పడుతున్న ఓ ముసిలాయనా, వేనిటీ బాగ్‌ని శ్రీకృష్ణుని చేతిలో చక్రంలా విలాసంగా తిప్పుతూ నిర్లక్ష్యమో పరధ్యానమో అంతుచిక్కకుండా అదో రకం వయ్యారంతో నిలబడి, అటెటో చూస్తున్న ఓ యౌవనాంగీ, ఇద్దరే ఉన్నారు తను కాక.

అవునూ, ఈ మోహనాంగి, నిన్న ఇదే బస్‌స్టాప్‌లో తను ఎక్కిన బస్సు ఎక్కిందేమో. ఏమో ఏమిటీ! ఎక్కింది. నిన్నే కాదు, రెండు మూడు రోజుల నుంచి తను దిగిన స్టాప్‌లో కూడా దిగుతోంది. ఆఫీసు కంగారులో తను పట్టించుకోలేదు కాని, కచ్చితంగా అదే జరుగుతోంది. ఈ స్టాప్‌లో ఎక్కడం, ఆ స్టాప్‌లో దిగడం - పైగా అదే బస్సు. మరి ఆ బస్సులో వెళ్ళిపోలే దేం ఇవాళ? తనలాగే అరగంట ఆలస్యంగా వస్తా నని ఆఫీసులో పర్మిషన్ పెట్టిందేమో, ఏమో!

ఏడిసినట్టుంది. అసలా అమ్మాయి ఉద్యోగం చేస్తోందని గ్యారంటీ ఏమిటి? చదువుకుంటూ ఉండొచ్చు కదా! అవును, వయస్సు చూసినా, వయ్యారం చూసినా ఇంకా కాలేజీ విద్యార్థినిలాగే ఉంది. ఉద్యోగిని అయితే ఇంకొంచెం నిలబాటూ, నెమ్మదితనమూ ఉంటాయి. ఉద్యోగంలో చేదు అనుభవాలు ఎదురవుతాయి కదా! ఇంకా అలాంటి ఢక్కామొక్కీ లేం తిన్నట్లు లేదు. కచ్చితంగా కాలేజీ విద్యార్థినే! ఏం చదువుతోంది చెప్మా!

'ఒరేయ్ కిశోర్! నీ కేమైనా బుద్ధి ఉందా? ఆ అమ్మాయి ఏం చదివితే నీకేంరా? అసలు చదవకపోతే నీకేం? పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి బుద్ధిగా నిలబడు. అవతల సిటీ బస్సు వచ్చే వేళయింది. అక్కరలేని ఆలోచనల్లో పడి కొట్టుకుపోయావంటే

బస్సు మిస్సు కాగలవు. ఈ మిస్ కోసం అది మిస్ అయ్యావంటే ఆఫీసరు తల అంటేస్తాడు జాగ్రత్త!' మనస్సులో ఓ మొట్టికాయ మొట్టుకుని మంచి పిల్లాడిలా దిక్కులు చూడకుండా నిలబడ్డాడు కిశోర్.

కిశోర్ స్వతహాగా మంచివాడే. కాని అతని మనస్సూ, అంతకంటే అతని వయస్సూ అంత మంచివి కావు. అందుకే ఎన్ని చీవాట్లు పెడుతున్నా లెక్క చేయకుండా, అవి అతన్ని ఆ అమ్మాయి కేసి చూడమంటున్నాయి. అక్కడికీ చూపుల్ని బరబరా లాక్కొచ్చి తన దగ్గరున్న స్తంభానికి కట్టేస్తున్నాడు. కాని అవి గొలుసులు తెంపుకుని మళ్ళీ మళ్ళీ ఆ అమ్మాయి కేసి పరుగెత్తుతున్నాయి. అవి పోవడం, తను లాక్కుని రావడం - మళ్ళీ అవి పోవడం - నానా అవస్థా పడుతున్నాడు.

తన అవస్థ గమనించినట్టున్నాడు కునికిపాట్లు పడుతున్నట్లు కూర్చున్న ముసిలాడు. గట్టిపిండమే. మూసి ఉన్న కళ్ళతో ఎలా చూశాడు చెప్మా? ఓ చిరునవ్వు నవ్వాడు. అమ్మ ముసిలాడోయ్! ఏం నవ్వు నవ్వావురోయ్! కిశోర్ తడబడ్డాడు.

అలా తడబడుతూనే మళ్ళీ ఆ అమ్మాయి కేసి చూశాడు. ఆ ముగ్ధ సుకుమారి ఇటు చూడటమే లేదు. ఈ ముసిలాడి బదులు ఆ అమ్మాయి చూడకూడదూ తన కేసి? ఓ చిరునవ్వు విసరకూడదా? ఊహుఁ! తన జాతకంలో ఇవాళ ముసలి చూపులే రాసి ఉన్నాయేమో! పడుచు చూపులూ, పడుచు నవ్వులూ లేవేమో!

గట్టిగా, వేడిగా, నీరసంగా నిట్టూర్చాడు కిశోర్. నిట్టూర్పుకు జవాబుగా బస్సు హారన్ వినిపించింది. దాంతో చూపులూ, నవ్వులూ, ఊహలూ, నిట్టూర్పులూ - అన్నీ మూట కట్టేసి, ఆగుతున్న బస్సు డోర్ దగ్గరకు పరిగెత్తాడు.

“ఏవయ్యోయ్! ఏమిటా చూపులూ, పరధ్యానమూను! ఎక్కడి కెళ్ళాలి? టికెట్ తీసుకో!” అన్న కండక్టరు అరుపుతో ఈ లోకంలోకి వచ్చాడు కిశోర్. అంతవరకూ ఆ అమ్మాయి ఏ సీటులో కూర్చుందో, సీటు దొరక్క నిలుచుందేమో! అసలింతకీ బస్సు ఎక్కిందో, లేదో అని బస్సంతా తెగ వెతకసాగాడు కళ్ళతో.

తన ముందు సీట్లో కూర్చున్న ఇందాకటి ముసిలాడు కిసుక్కున నవ్వి తన కేసి చూశాడు. వాడిని చంపేద్దామన్నంత కోపం వచ్చింది కిశోర్‌కి.

మళ్ళీ కండక్టరు అరిచాడు. “వినిపిస్తోందా? టికెట్ తీసుకో!” అని.

ఈమారు కిశోర్ స్థిమితపడి, దర్జాగా ముఖం పెట్టి, “పాస్!” అన్నాడు.

కండక్టరు నమ్మలేదు. “ఏదీ, పాస్ చూపించు!” అన్నాడు.

కిశోర్‌కి అవమానం అయింది. “ఏం నమ్మకం లేదా?” అన్నాడు గట్టిగా. అతని

కంఠంలో తీవ్రతకి బస్సులో జనం అంతా అతనికేసి చూశారు. అందరితోబాటూ, నాలుగు సీట్లు అవతల ఉన్న ఆ అమ్మాయి కూడా చూసింది తల వెనక్కి తిప్పి.

పారిజాతాల వర్షం కురిసింది.

ఆ చూపుల జల్లుకి పులకించిపోయి, యాంత్రికంగా కండక్టరుకి పాస్ చూపించిన సంగతీ, తిరిగి జేబులో పెట్టుకున్న సంగతీ జ్ఞాపకం లేకపోయింది కిశోర్‌కి.

అతనికి జ్ఞాపకం ఉన్నదల్లా ఆ కోల ముఖం -

కళ్ళ అందాల్ని కనపడకుండా దాచేసిన నల్లగాగుల్స్ -

పొడుగ్గా కొనదేలిన ముక్కు

చిన్న నోరు, సన్నని పెదిమలూ, ఆ పెదిమల మీద చిరునవ్వు.

ఆ గాగుల్స్ వెనకాల ఉన్న కళ్ళ అందాలు కూడా కనిపిస్తే?

కండక్టరు అరుపుతో అతని ఆలోచనల దారం తెగింది. తను దిగవలసిన స్టాప్!

బస్సు దిగి, గబగబా అడుగులు వేసుకుంటూ పోతున్న కిశోర్‌ని "మిస్టర్" అని ఎవరో పిలిచారు. వెనక్కి తిరిగి చూస్తే, ఆ ముసిలాడు! రెండు అంగల్లో వచ్చి కలుసుకుని "ఇందాక బస్సులో మీరు కూర్చున్న చోట ఈ పాస్ పడి ఉంది. జేబులో పెట్టుకోబోయి పరధ్యానంలో ..." అంటూ నవ్వాడు.

ఆ నవ్వులో ఎంత పరిహాసం! ఎంత వెక్కిరింపు!

కోపం వచ్చినా థాంక్స్ చెప్పక తప్పలేదు కిశోర్‌కి. ముసిలాయనకు థాంక్స్ చెబుతూనే రోడ్డుకి అటువైపు చూశాడు. రోడ్డు క్రాస్ చేస్తూ ఆ అమ్మాయి.

అదే విలాసం,నడకలో అదే వయ్యారం!

కిశోర్ గుండెల్లో జల్లు మన్న పులకింత!

ఇది జరిగి దాదాపు పదిపదిహేను రోజులైంది. ఈ పదిపదిహేను రోజుల్లోనూ ఆ అయస్కాంతం పిల్ల, ఒకటి రెండుసార్లు కంటే ఎక్కువ కనిపించలేదు. కనిపించినా ఎలాగని? తటిల్లతలా ఇలా మెరిసి,అలా మాయమైపోవడం. గట్టిగా పరకాయించి చూడడానికే వీలు చిక్కడం లేదు. ఓసారి బస్‌స్టాండ్‌లో. మరోసారి బట్టల కొట్టులో. కనిపించిన ఆ రెండు మూడు సార్లూ తను ఆబగా ఆమెకేసి చూడటమే! కాని, ఆమె కూడా చూస్తోందేమో! శరీరంలో విడదీయరాని భాగంగా ఆ నల్ల గాగుల్స్ ఒకటీ, ఎటు చూస్తోందో తెలుసుకోడానికి వీల్లేకుండా.

ఆమెను కలుసుకోవాలనీ, మాట్లాడాలనీ, పరిచయం పెంచుకోవాలనీ - అన్నీ కలిసి వస్తే అర్ధాంగిగా చేసుకోవాలనీ - ఏవేవో ఆశలూ ఆలోచనలూ, ఊహలూ - ఏ

పని మీదా ధ్యాస ఉండటం లేదు. ఏం చేద్దామన్నా తోచడంలేదు. భోజనం, నిద్రా, సరేసరి! అసలు వాటి ధ్యాసే పోయింది. రాత్రీ పగలూ, ఇరవై నాలుగు గంటలూ ఆ అమ్మాయి ధ్యాసే! ఒడ్డున పడ్డ చేపలా ఉంది కిశోర్ పరిస్థితి.

ఓ రోజు తను మామూలుగా నిలబడే బస్‌స్టాండ్‌లో, పక్కనే ఎత్తుగా ఉన్న రాడ్ మీద ఓ కాలు పెట్టి, రెండో కాలు నేలమీద ఆన్చి బేలెన్స్ సరిగా లేని స్థితిలో నుంచుని, ఇటూ అటూ దిక్కులు చూస్తున్నాడు కిశోర్ - ఆ అమ్మాయి ఎక్కడైనా కనిపిస్తుందేమోనని.

ముద్దుగుమ్మ కనిపించలేదు. కాని ముసిలాడు కనిపించాడు. కనిపించడంలోనూ ఎలాగని? మామూలు ఎగతాళి నవ్వు నవ్వుతూ. ఆ నవ్వు చూసేసరికి నరికిపారెయ్యాలనిపించింది కిశోర్‌కి. నరికేసేవాడో, నమిలి మింగేసేవాడో కాని ఇంతలో ఆ ముసిలాడు నోరు విప్పి, "బాబూ! ఎవరి కోసం వెతుకుతున్నావు?" అని అడిగాడు.

కిశోర్‌కి ఒళ్ళు మండిపోయింది. అతనికి సమాధానం చెప్పకుండా ఊరుకుందామనుకున్నాడు. కాని అప్రయత్నంగా అతని నోరు అనేసింది - "అబ్బే! ఎవరికోసమూ లేదండీ! ఒక స్నేహితుడు బస్‌స్టాప్‌లో కలుస్తానంటేనూ!" మాట నాన్చేశాడు.

"స్నేహితుడంటే..? ఆహఁ మరేం లేదు. ఈ రోజుల్లో మగాళ్ళకి ఆడ స్నేహితులూ, ఆడాళ్ళకి మగ స్నేహితులూ ఉంటున్నారు. అందుకనీ..." ఈ మాట అంటూ కొంటెగా చూశాడు ముసిలాడు కిశోర్‌కేసి.

కిశోర్ ఉలిక్కిపడ్డాడు. వీడెక్కడో దేవాంతకుడిలా ఉన్నాడు.

వీడికి మనస్సులు చదివే శక్తి ఉందా ఏమిటి? కొంపదీసి!

ముసిలాడు కొంచెం దగ్గరగా వచ్చి "ఆ అమ్మాయి కోసమేనా?" అంటూ అడిగాడు రహస్యంగా.

ఒళ్లో బాంబు పేలినట్లు జడుసుకున్నాడు కిశోర్. కాని అంతలోనే స్థిమితపడి, సీరియస్‌గా మొహం పెట్టి "ఏ అమ్మాయి అని మీ ఉద్దేశం?" అ నడిగాడు కోపంగా.

"నా ఉద్దేశం అలా ఉంచు. ముందు నీ ఉద్దేశం చెప్పు. ఆ అమ్మాయి నచ్చిందా నీకు? పెళ్ళి చేసుకుంటావా?"

ఓరి వీడి చౌరవ మండా! వీడేదో ఆ పిల్లకి గార్డియన్ అయినట్టూ, కాళ్ళు కడిగి కన్యాదానం చేయబోతున్నట్లూ మాట్లాడుతున్నాడు.

వీడి కేమైనా పిచ్చా? లేక, నన్ను వెర్రాడి కింద జమకట్టి మాట్లాడుతున్నాడా? కిశోర్ కాస్త తీక్షణగా ముసిలాడి కేసి చూశాడు. అతను కించిత్తయినా తొట్రు పడకుండా "చెప్పు, మొహమాట పడకు? నాతో చెప్తే ..."

ఆ పైన ముసిలాడి మాటలు తీరిగ్గా కూర్చుని వినడానికి కిశోర్‌కి ఖాళీ లేదు. సిటీ బస్సు వచ్చేసింది. గబగబా అటు పరుగెత్తాడు. ముసిలాడు ఆ బస్సు ఎక్కడు కాబోలు! షెడ్డులో స్థిమితంగా కూర్చుని సిటీ బస్సు ఎక్కుతూన్న కిశోర్‌కి వినిపించేలా వెనక నుంచి అన్నాడు - "ఇప్పుడు కాకపోయినా, తర్వాత స్థిమితంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాకైనా చెప్పు. తొందర లేదు!"

ఆ తర్వాత వారం పది రోజుల దాకా కిశోర్ బుర్రలో ఆ ముసిలాడు అన్న మాటలే గిరగిరా తిరగసాగాయి. ఏమో, తెలిసినవాడో, పక్కింటివాడో! సాయం చేస్తానంటున్నాడు. కాదని కాలదన్నుకోవడం ఎందుకు? తనేమైనా ఆ పిల్లనీ ఆ పిల్ల తల్లిదండ్రుల్నీ డైరెక్ట్‌గా అడగగలడా? అయినా వ్యవహారాలకీ, వివాహాలకీ మధ్యవర్తులుండాలంటారు. ఇతనో మధ్యవర్తి, అవుతుందా, పని అవుతుంది ఇతని వల్ల. కాదూ, మరో మార్గం అప్పుడే ఆలోచించవచ్చు.

ఇలా నిర్ణయించుకుని ఓ వారమల్లా ఆ ముసిలాడి కోసం గాలించాడు కిశోర్. తస్సదియ్యా! అవసరం అనేసరికి ఆ ముసిలాడు కనిపించడం మానేశాడు.

ఓ రోజు మునిమాపువేళ తను పార్కుకి వెళ్తే అక్కడికి దగ్గరలో ఓ బెంచీ మీద రెండు మోకాళ్ళ మధ్యా తల పెట్టి ఆలోచిస్తూన్న ముసిలాడు కనిపించాడు కిశోర్‌కి. పెన్నిధి దొరికినట్లయింది. వెంటనే వెళ్ళి పలకరించాడు. ఆ మాటా ఈ మాటా చెప్పి, చివరికి ఆ అమ్మాయి ప్రస్తావన ఎత్తాడు. ముసిలాడు విషాదంగా తల ఎత్తి చూసి ఊరుకున్నాడు. సమాధానం చెప్పలేదు. కిశోర్ గాబరా పడ్డాడు.

"ఏమండీ, మాట్లాడరేం? ఆ అమ్మాయి..."

"ఆ అమ్మాయి పరిస్థితి ఏం చెప్పమంటావు నాయనా!" అన్నాడు ముసిలాడు డగ్గుత్తికతో.

"ఏం, ఏమయింది? జబ్బు చేసిందా?ఎలా ఉంది?"

"జబ్బుకాదు నాయనా! డబ్బు! డబ్బున్న ఓ పిల్లాణ్ణి పెళ్ళి చేసుకోబోతోంది."

"ఆఁ!"

"సరిగ్గా చెప్పాలంటే ఆమె కాదు. అతడు! అతను పెళ్ళి చేసుకుంటున్నాడు ఆ అమ్మాయిని"

"అంటే?"

"అంటే, ఆ అమ్మాయికి ఇష్టం లేదు ఈ పెళ్ళి. కాని ఏం లాభం? ముహూర్తం రేపే!"

"రేపేనా?"

"అవును"

"తప్పించే ఉపాయం లేదా?"

"ఉంది. నువ్వు నే చెప్పినట్లు చేస్తానంటే"

"చెప్పండి"

"రేపు తెల్లారకుండా ఆ అమ్మాయిని వేణుగోపాలస్వామి ఆలయానికి తీసుకువస్తాను. నువ్వు అన్ని ఏర్పాట్లతోనూ సిద్ధంగా ఉండు. సూర్యోదయం కాకుండా, అదే ముహూర్తానికి ఆ అమ్మాయి మెడలో తాళి కట్టేద్దువుగాని!"

కిశోర్ ఉలిక్కిపడ్డాడు. ఇంత కంగారుగానా? స్థిమితంగా ఆలోచించకుండా, అమ్మకీ, నాన్నకీ తెలియపరచకుండా, వాళ్ళు రాకుండా. హడావుడిగా పెళ్లాడేయడమా?

"కొంచెం టైము ఇవ్వండి" అన్నాడు కిశోర్.

"టైమా? అయితే, ఆ అమ్మాయి నీకు దక్కదు. వెళ్ళు, నాయనా! వెళ్ళు. నువ్వు ఆ పిల్లని చేసుకోవాలనుకుంటున్నావు. ఆ పిల్లకి నిన్ను చేసుకోవాలని ఉంది. కాని ఏం లాభం? విధి వక్రిస్తోంది. సరే, కానీయ్!"

"అలా అనకండి! సరే కానియ్యండి. మీరు చెప్పినట్టే అన్ని ఏర్పాట్లతోనూ నేను సిద్ధంగా ఉంటాను ఆలయంలో"

ఆత్రుతా ఆనందం, సంతోషం సంతృప్తీ, సాధించామనే గర్వం - అమ్మా, నాన్నా ఏమంటారో ననే భయం!

ఇలా రకరకాల మానసిక స్థితుల మధ్య పెళ్ళి చేసుకుని వెంటనే తల్లిదండ్రులకి నమస్కరించి జరిగింది చెప్పి, వాళ్ళ ఆశీర్వచనం పొందడానికి భార్యని తీసుకుని వాళ్ళ ఊరు వెళ్ళాడు కిశోర్.

జరిగిందంతా విని, కొత్త కోడలిని తేరిపార చూసి, ఒకటి రెండు ప్రశ్న లడిగి, "హత్తెరీ!" అంటూ తాడి ఎత్తున లేచారు కిశోర్ తల్లీ, తండ్రీను.

కిశోర్‌కి అర్థం కాక, "ఏమిటీ, ఏమైందీ?" అన్నాడు.

"ఏమైందేమిటి? నీ మొహం అయింది. మనకి భంగపాటయింది. ఏడాదిక్రితం ఈ పిల్లని చూడటానికని పెళ్ళి చూపులకి వెళ్ళాం. ఇంకా పెళ్ళి చూపులు కాకుండా

కట్నాలూ, లాంఛనాలూ కబుర్లు వచ్చి ఆడవాళ్ళ మధ్య మాటా మాటా పెరిగి చివరికి వచ్చేశాం" అన్నాడు కిశోర్ తండ్రి. "ఆ! తనాపిల్లని కూడా చూడకుండా". "అవును. అది తునిలో జరిగింది. నిజమే. ఏడాదిక్రితం -" జ్ఞాపకం తెచ్చుకుంటూ అన్నాడు కిశోర్ - "తర్వాత ఆ పిల్ల తాత, తుని వచ్చి సంగతంతా తెలుసుకుని" ఆ పిల్లాడికే నా మనవరాలి నిచ్చి పెళ్ళి చేస్తాను, కాణీ కట్నం లేకుండా" అంటూ ప్రగల్భాలు పలికాడట, మన చుట్టాల దగ్గర" అంది కిశోర్ తల్లి.

"ప్రతిజ్ఞ కూడా చేశాట్టగా!" అన్నాడు కిశోర్.

"చేశాడు."

"ఇప్పుడది నెరవేర్చుకున్నాడు తన మనవరాలిని నీ కిచ్చి, కాణీ కట్నం లేకుండా, నిన్ను బుట్టలో వేసుకుని" తండ్రి రంకెలు వేస్తూంటే -

"అమ్మ ముసిలాడోయ్!" అనుకున్నాడు. కిశోర్ ముసిలాడి చిరునవ్వు ఉండుండి జ్ఞాపకం వచ్చి.

*(1984, ఆంధ్ర ప్రభ)*